01ATP11F_01ATP11F.qxd 11-01-2026 PM 11:15 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 12 జనవరి 2026 పేజీలు : 04

వడ్డే ఓబన్న పోరాటం నేటి తరానికి ఆదర్శం

- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జెసి మోర్య భరద్వాజ్ తదితరులు

శ్రీ సత్యసాయి జిల్లా, జనవరి 11, ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజాభ్యుదయం కోసం వడ్డే ఓబన్న చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శం అని పుట్టపర్తి శాసన సభ్యురాలు సింధూర రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం ఉదయం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 219వ జయంతి వేడుకలు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎం. మోర్య భరద్వాజ్, డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి రాజేంద్ర రెడ్డి, వివిధ సంఘాలకు చెందిన నాయకులు పాల్గొని వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, గ్రామ రక్షకుడిగా (తలారి) పనిచేసిన వడ్డే ఓబన్న, బ్రిటిష్ పాలనలో గ్రామ రక్షకుల జీతాలు రద్దు చేసిన అనంతరం రైతుల కష్టాలను గుర్తించి 1845లో ఉద్యమానికి నాయకత్వం వహించారన్నారు. సుమారు 9,000 మంది సైనికులతో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయ పోరాటం సాగించారని గుర్తు చేశారు. వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వడ్డెర్ల సమాజం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎం. మోర్య భరద్వాజ్ మాట్లాడుతూ, స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న దేశభక్తి భావితరాలకు చిరస్ఫూర్తి అని అన్నారు. 1857 స్వాతంత్ర ఉద్యమానికి ముందే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రతిఘటనలో వడ్డే ఓబన్న కీలక పాత్ర పోషించారని తెలిపారు.

మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా భరతమాత స్వేచ్ఛ కోసం పోరాడిన వీరుడు వడ్డే ఓబన్న అని, ముఖ్యంగా వడ్డే బోయ, యానాది, చెంచు వంటి బడుగు బలహీన వర్గాల ప్రజల కష్టాలను అర్థం చేసుకుని వారి హక్కుల సాధన కోసం కృషి చేసిన గొప్ప మానవతావాదిగా ఆయన చరిత్రలో నిలిచారని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి రాజేంద్ర రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తిలక్‌నగర్‌లో కార్డెన్‌సెర్చ్

- ఇంటింటా పోలీసుల సోదాలు
- ప్రశాంతతకు భంగం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవు
- జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్

మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్

లేపాక్షి, జనవరి 11 ప్రభాతవార్త

లేపాక్షి మండల పరిధిలోని తిలక్‌నగర్‌లో ఆదివారం డిఎస్‌పి మహేష్ ఆధ్వర్యంలో రూరల్ సిఐ జనార్ధన్, లేపాక్షి ఎస్ఐ నరేంద్రల నేతృత్వంలో ఆదివారం తెల్లవారుజామున కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. పలు ఇళ్లలో పోలీసులు సోదాలు నిర్వహించారు. రౌడీ షీటర్లు, అనుమానితుల ఇళ్లల్లో, విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఇళ్లతో పాటు పెరిట్లో కూడా పోలీసుల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 6 ఆటోలు, 65కు పైగా ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. కాలనీలో జరుగుతున్న విషయాలపై పోలీసులు ఆరా తీశారు. అనంతరం జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ మాట్లాడుతూ తిలక్‌నగర్‌ను ఆనుకొని డైవర్స్ కాలనీ, సలామత్‌నగర్, కిరికెర, వీవర్స్‌కాలనీ, రైల్వే రహదారి కూడా ఉందన్నారు. తిలక్‌నగర్ నివాసి సీనియర్ టిడిపి నాయకుడు మారుతిప్రసాద్‌తో పలు విషయాలపై చర్చించారు. తిలక్‌నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తుల సంచారం ఉందన్నారు. ఇళ్లను బాడుగలకు ఇచ్చే సమయంలో కనీసం వారి గుర్తింపు కార్డులను కూడా చూడక అధిక మొత్తంలో ఇంటి బాడుగలు వస్తుందన్న నెపంతో ఇళ్లను బాడుగకు ఇవ్వడం మంచి పద్ధతి కాదన్నారు. ఇతర ప్రాంతాల్లో నేరాలు చేసి తిలక్‌నగర్, సలామత్‌నగర్‌లో తలదాచుకుంటున్నట్టు పలు ఆరోపణలు ఉన్నాయన్నారు. పోలీసులు కూడా శక్తి వంచన లేకుండా ఈ విషయాలపై ఆరా తీస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ మనల్ని మనం సంరక్షించుకోవాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. నూతన వ్యక్తులు కాలనీలోకి ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కాలనీ యువకులు రాత్రి సమయాల్లో గస్తీ తిరగాల్సిన అవసరం కూడా ఉందన్నారు. 2019 నుండి 2025 వరకు 30 నేరాలు జరిగాయన్నారు. ఇటీవల కూడా ఓ వ్యక్తిని కిరాతకంగా చంపి షెడ్డులో పడి వేసి వెళ్లడం జరిగిందన్నారు. ఆ నేరస్తులు కూడా మన సమక్షంలోనే ఉన్నట్టు ఎస్‌పి పేర్కొన్నారు. కాలనీలో ప్రధాన సర్కిల్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కాలనీవాసులకు ఎస్‌పి సుచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేర నియంత్రణ జరుగుతుందన్నారు. కాలనీలో

సీజ్ చేసిన ద్విచక్రవాహనాలు

కొత్తవారు కనిపిస్తే సీసీ కెమెరాల ద్వారా వెంటనే పసిగట్టవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి 500 రూపాయలు చందాలు వేసుకుని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఏరియా విశాలంగా ఉండడంతో డ్రోన్ కెమెరాలను కూడా ఏర్పాటు చేసినట్టు ఎస్‌పి తెలిపారు. ప్రత్యేక బృందాలు, ఏదో ఒకచోట ఉండి డ్రోన్ కెమెరాలతో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను గుర్తించడం జరుగుతుందన్నారు. ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించడం జరుగుతుందని ఎస్‌పి హెచ్చరించారు.

ఆరు వాహనాలు, 65 ద్విచక్రవాహనాలు సీజ్

తిలక్‌నగర్‌లో ఆదివారం చేపట్టిన కార్డెన్‌సెర్చ్‌లో రికార్డులు లేని 6 ఆటోలు, 65కు పైగా ద్విచక్రవాహనాలు సీజ్ చేసినట్టు ఎస్‌పి తెలిపారు. ఇతర ప్రాంతాల్లో ఎలాంటి రికార్డులు లేని పాత వాహనాలను కొనుగోలు చేసి ఈ విధంగా ఇబ్బందులకు గురి కావడం మంచిది కాదన్నారు. వాహనాలు లేపాక్షి స్టేషన్‌కు తరలించడం జరుగుతుందని సంబంధిత రికార్డులు చూపించి వాహనాలను తీసుకువెళ్లాలని ఎస్‌పి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు రాజగోపాల్‌నాయుడు, కరీం, రాజకుమార్, ఎస్ఐ శ్రీధర్, దాదాపు 120 మంది పోలీసులు పాల్గొన్నారు.

విద్యతోనే బీసీలు శాసించే స్థాయికి...

- బీసీల అభివృద్ధే అభిలాషగా పని చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- వెనుకబడిన తరగతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం
- ఎన్నికల హామీ మేరకు ఒడ్డే ఓబన్న జయంతికి శాశ్వత జీవో జారీ : మంత్రి సవిత
- ఘనంగా వడ్డే ఓబన్న రాష్ట్ర స్థాయి జయంతి వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవితమ్మ, పక్కన ఎంపీలు, ఎమ్మెల్యే లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

అనంతపురం న్యూటౌన్, జనవరి 11 ప్రభాతవార్త

బ్రిటిష్ నిరంకుశ పాలనకు ఎదురొడ్డి ప్రజల హక్కుల కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న 219వ జయంతి వేడుకలు ఆదివారం అనంతపురము నగరంలోని లలిత కళా పరిషత్ వేదికగా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బిసి సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ఎస్.సవితమ్మ, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథి, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, వడ్డర్ల కార్పొరేషన్ చైర్మన్ మల్లెల మురళి, బిసి సంక్షేమ శాఖ సంచాలకులు మరియు వీసీ అండ్ ఎండీ మల్లిఖార్జున, అనంతపురము జిల్లా ఇంచార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితమ్మ పాల్గొన్నారు. మంత్రితో పాటు ఈ కార్యక్రమంలో అనంతపురం, హిందుపురం ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బికె.పార్థసారథి, అర్బన్ ఎమ్మెల్యే, సభాధ్యక్షులు దగ్గుపాటి ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, వడ్డర్ల కార్పొరేషన్ చైర్మన్ మల్లెల మురళి, బిసి సంక్షేమ శాఖ సంచాలకులు, వీసీ అండ్ ఎండీ మల్లిఖార్జున, అనంతపురము జిల్లా ఇంచార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర రావు, దేవళ్ళ మురళి, వడ్డె అంజనప్ప, మల్లెల జయరాం, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు, వడ్డెర సంఘ ప్రతినిధులు, బిసి కులాల ప్రతినిధులు, ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి రామ్మోహన్, అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి ఖుష్బూ కొఠారి, బిసి కార్పొరేషన్ ఈడి రామసుబ్బయ్య, తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతపురం నగరంలో ఆదివారం నిర్వహించిన ఒడ్డే ఓబన్న రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, పలు కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు, వడ్డెర సంఘ నాయకులతో కలసి మంత్రి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ.. విద్యతోనే బీసీలు ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి చేరుకోగలరని స్పష్టంచేశారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే బ్రిటీషర్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా పోరాటం జరిపిన యోధుడు వడ్డే ఓబన్న అని వారు కొనియాడారు. అమరజీవులు వడ్డే ఓబన్న 129వ జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించుకోవడం ఎంతగానో సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డే ఓబన్న జయంతి రాష్ట్ర వేడుకగా ప్రకటించినప్పుడు మొదటి కార్యక్రమం గుంటూరు నందు నిర్వహించుకున్నామని, ఇప్పుడు మన అనంతపురము జిల్లాలో నిర్వహించుకోవడం, అందరి సహకారం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బిసిలకు గుర్తింపు ఇచ్చిన, అండగా నిలిచిన వారు ఎన్టీఆర్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బిసిల సంక్షేమం కోసం మొదట సమావేశం నిర్వహించారని, బీసీల పట్ల నిజమైన నిబద్ధత కలిగిన ప్రభుత్వం ఇదే అని అన్నారు. బిసి మహిళగా ఉన్న తనకు బిసి సంక్షేమ శాఖ మంత్రిగా సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. యువ నాయకుడు నారా లోకేష్ యువగళం పాదయాత్రలో వడ్డర్లకు ఇచ్చిన హామీ మేరకు వారికి మేలు చేయాలని నిబద్ధతతో వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా శాశ్వతంగా రాష్ట్ర వేడుకగా జరుపుకోవాలని జి.ఓ వచ్చేలా కృషి చేశారని, ఇందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. విద్యావంతులుగా అయినప్పుడే పురోగతి ఉంటుందని తెలుపుతూ, మన రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని, తల్లికి వందనం తదితర విద్యా పథకాలలో ఎక్కువ మంది బిసిలు ఈ విద్యా ఫలాలు వినియోగించుకుంటున్నారని సంతోషంగా ఉందని అన్నారు. వడ్డర్లను ఎస్టీ జాబితాలో చేర్చే అంశం ప్రభుత్వం దృష్టిలో ఉందని, బిసిలకు ఎంఎస్ఎమ్ఈ పార్కుల కేటాయింపులో రిజర్వేషన్ కల్పిస్తున్నామని అన్నారు. క్వారీలలో 15 శాతం వడ్డర్లకు రిజర్వేషన్ కల్పించడం హర్షించదగినదన్నారు. కూటమి ప్రభుత్వంలోనే బిసిలకు న్యాయం జరుగుతోందన్నారు. ఆదరణ 1,2 ల అమలు చంద్రబాబు నాయుడు హయాంలో జరిగాయని, ఇప్పుడు ఆదరణ 3.ఓ కూడా పక్కాగా అమలుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో వడ్డర్లకు పనిముట్లు ప్రాధాన్యతగా అందిస్తామని అన్నారు. బీసీల పక్షపాతి, బీసీలే శ్వాస, బీసీలే ధ్యాస, బీసీల అభివృద్ధే అభిలాషగా పని చేస్తున్న మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని తెలిపారు. బీసీ గురుకుల పాఠశాలల పునరుద్ధరణ పనులు చేపట్టాం, వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం అన్నారు. ఒకపక్క సంక్షేమ పథకాలు అందజేస్తూ, ఒక పక్క రాష్ట్రానికి సంపద సృష్టిస్తూ పరిశ్రమలు తీసుకొస్తు మన బిడ్డలకు ఉపాధి చూపించడానికి మన ముఖ్యమంత్రి, మన డిప్యూటీ సీఎం, క్యాబినెట్ మరి ప్రజాప్రతినిధులు అందరూ కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి దశా దిశ మేరకు ఏదైతే జనాభా దామాషా ప్రకారం నిధులు విధులు కూడా కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేస్తున్నామని, అంతే కాకుండా బీసీల రక్షణ చట్టం కొరకు కూడా అడుగులు వేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా జరగనంత అభివృద్ధి మన రాష్ట్రంలో జరుగుతున్నదన్న విషయం గుర్తు చేసారు. బిసి కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ మల్లిఖార్జున మాట్లాడుతూ..రాష్ట్ర స్థాయి వడ్డే ఓబన్న జయంతి వేడుకల సందర్భంగా వడ్డెర్లందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ వడ్డే ఓబన్న తొలి తరం స్వాతంత్ర్య సమర యోధుడు అని, ఆయన త్యాగాలను కృషిని గుర్తించి వారి జయంతిని రాష్ట్ర వేడుకగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తున్న వడ్డెరలు వారి స్ఫూర్తితో ముందుకు వెళ్ళాలని కోరుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తోందని పేర్కొన్నారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడుతూ.. మన జిల్లాలో 219వ జయంతి రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహించుకోవడం ఎంతగానో సంతోషంగా ఉందని అన్నారు. తొలి తరం స్వాతంత్ర్య సమర యోధుడు 1846 జూలై 10న కోవెలకుంట్ల తహసీల్దార్ కార్యాలయం, ఖజానాపై దాడి చేసి బ్రిటిష్ పాలనలో పీడనకు గురైన రైతులకు పంచి పెట్టిన గొప్ప మహానుభావుడు, సాహసి వడ్డే ఓబన్న అన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన రేనాటి వీరుడు అని కొనియాడారు. 1857 సిపాయిల తిరుగుబాటు కన్నా ముందుగానే రైతుల కష్టం దోపిడీకి గురి కాకూడదని, మన దేశ ప్రజలపై బ్రిటిష్ దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కొని పోరాడారని అన్నారు. వడ్డర్ల యుగపురుషుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు. వడ్డర్లు కూడా తాము ఎదిగేందుకు కృషి చేయాలని, విద్యావంతులు కావాలని అన్నారు. గతంలో ఎన్టీఆర్ హయాంలో, నేడు చంద్రబాబు నాయకత్వంలో పలువురు బీసీలకు, వడ్డర్లకు సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో సముచిత స్థానాన్ని కల్పించారని అన్నారు. ఓబులదేవర చెరువులో వడ్డర్లకు కల్యాణ మండపం నిర్మిస్తున్నామని, బి.సి ఎంపీగా తాను కూడా బిసి సంక్షేమం కొరకు కోటి రూపాయలతో కళ్యాణ మండప నిర్మాణాలు పలు చోట్ల చేపడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లెల ఈశ్వర రావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం బిసిల సంక్షేమ ప్రభుత్వం అని దానికి నిదర్శనమే వడ్డే ఓబన్న జయంతి రాష్ట్ర వేడుకగా ప్రకటించిందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. వడ్డె ఓబన్న జయంతి రాష్ట్ర స్థాయి వేడుకలు మన అనంతపురము జిల్లాలో జరగడం ఎంతో సంతోషంగా ఉందని, మంత్రి సవితకి ధన్యవాదాలు తెలిపారు. వెనుకబడి ఉన్న వడ్డెర సోదరుల సంక్షేమం కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వారికి పనిముట్లు, మైనింగ్ రిజర్వేషన్ తదితర అంశాలను అమలు చేస్తోందని, పట్టణంలో వడ్డే ఓబన్న విగ్రహం అనివార్య కారణాల వలన ఏర్పాటు కాలేదు అని, వచ్చే సంవత్సరం వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ చేసుకుందామని అన్నారు. ఎమ్మెల్యే మడకశిర ఎమ్.ఎస్ రాజు మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలకులకు ఎదురొడ్డిన తొలి తరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న అని, రాష్ట్ర వేడుకగా మన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. తన నియోజకవర్గంలో మడకశిరలో వడ్డే ఓబన్న విగ్రహం తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. వడ్డెరలకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందని పేర్కొన్నారు. ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పూల నాగరాజు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు చైర్మన్, పలువురు వడ్డెర సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. తొలి నాటి స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నేతృత్వంలో బ్రిటిష్ వారికి ఎదురొడ్డి రైతుల పక్షాన పోరాడారని వారు ఆదర్శనీయులు అని పేర్కొన్నారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా పలువురు వడ్డర్లకు సన్మానం చేయగా, మంత్రిని పలువురు వడ్డెర సోదర సోదరీమణులు, అధికారులు సముచితంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్లు సుభాషిని, రంగమ్మ, గంగాద్రి, మస్తాన్, బీసీ వెల్ఫేర్ జిల్లా కార్యాలయం పర్యవేక్షకులు ఆంజనేయులు, పలువురు వార్డెన్లు, బీసీ కార్పొరేషన్ సిబ్బంది, వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ మల్లికార్జున

బడ్జెట్‌కు ముందే ధూమపాన, గుట్కా ప్రియులపై బాదుడు

- ఏజెన్సీలు, వ్యాపారులతో కుమ్మక్కై సరఫరాలో కోత
- బ్లాక్ మార్కెట్‌లో మూలుగుతున్న సిగరేట్లు, గుట్కాలు
- గోడౌన్లలో నిల్వ వుంచి అధిక ధరలకు విక్రయాలు
- బడా వ్యాపారులతో కుమ్మక్కై మామూళ్ల మత్తులో పర్యవేక్షణాధికారులు..?

అనంతపురం
జనవరి 11 ప్రభాతవార్త

వచ్చే నెల ఒకటవ తేదిన కేంద్ర బడ్జెట్ సమావేశంలో పొగాకు ఉత్పత్తులపై పన్ను పెంచుతున్నట్లు ప్రచారం చోటుచేసుకోవడంతో గత వారం రోజుల నుంచి సిగరెట్, బీడి, గుట్కాలు వంటి వాటిని నిరంతరం సరఫరా చేసే ప్రముఖ ఏజెన్సీలు సాధారణంగా వ్యాపారులకు ఇచ్చే మొతాదుల్లో ఇవ్వకుండా కృత్రిమ కొరత సృష్టించి అరకొరకగా పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో బ్లాక్ మార్కెట్‌లో ధరలు పెరుగుతున్నాయన్న ఊహాగానాలు ఏర్పడడంతో ప్రముఖ హోలేసేల్ వ్యాపారులు పెద్ద ఎత్తున గోడౌన్లలో పొగాకు ఉత్పత్తుల నిల్వ వుంచి ధరలు పెంచేసి మధ్య, చిరు వ్యాపారులకు విక్రయాలు చేస్తున్నారు. అయితే ఇందుకు సంబంధించి పర్యవేక్షించే అధికారులు బడా వ్యాపారులతో కుమ్మక్కై మామూళ్ల మత్తులో తూలుతున్నారన ఆరోపణలు తీవ్రంగా వున్నాయి.

వివరాల్లోకి వెళితే... గత వారం రోజుల నుంచి చిరు వ్యాపారులకు ప్రముఖ కంపెనీ ఏజెన్సీలు తగినంత సిగరెట్, బీడి, గుట్కాలు ఇవ్వకుండా అరకొరకగా చిరు వ్యాపారులకు అందజేస్తున్నాయి. దీంతో డిమాండ్ ఏర్పడేలా ప్రముఖ కంపెనీల ఏజెన్సీలు సృష్టించేశాయి. ఈ తరుణంలో నగరంలోని పాతవూరులో ఓ నాయుడుతో పాటు, ఓ ముస్లిం వ్యాపారి ఇరువురు ప్రధానంగా ఎద్ద ఎత్తున గోడౌన్లలో నిల్వ వుంచి మామూలు ధరల కంటే 20శాతం అదనంగా చిల్లర వ్యాపారులకు ప్రస్తుతం విక్రయిస్తున్నట్లు చిరు వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు. బడ్జెట్ సమావేశం నిర్వహించడానికి ఇంకా 20 రోజుల మునుపే ధరలు ఈ విధంగా వుంటే, బడ్జెట్ సమావేశంలోపు అంటే మరో 20 రోజుల్లో మరింత ధరలు పెంచడం ఖాయం అన్న అనుమానం చిరువ్యాపారుల్లో నెలకొంది. ఒకే సారి ప్రస్తుతం ఒక్కొక్క సిగరెట్‌పై రూ.2లు, బీడిలు కట్టపై రూ.3లు, గుట్కాలపై రూ.2లు ప్రస్తుతం చిరువ్యాపారులు అమ్ముతుంటే ధూమపాన ప్రియులు చిరువ్యాపారులపై చిందులు వేస్తున్నారు. ఈ తరుణంలో చిరువ్యాపారులు దూమపాన ప్రియులకు సైతం ఈ రోజుకు ఈ ధర పెరిగింది, వచ్చే 20 రోజుల్లో ఎంత పెరుగుతుందో చెప్పలేమని, ఇష్టమైతే కొనండి లేకుంటే మేము ఏమి చేయలేమని, కంపెనీలు సరఫరాల్లో కృత్రిమ కొరత సృష్టించడం వల్ల మేము బ్లాక్ మార్కెట్‌లో తెచ్చుకుంటున్నామని చెప్పుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పాతవూరులో ఇరువురు బడా వ్యాపారులు గోడౌన్ల నిర్వాహకులతో కుమ్మక్కై కోట్లాది రూపాయలు సరుకును గోడౌన్లలో నిల్వ వుంచుకుని, రోజూ కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నట్లు చిరువ్యాపారులు వ్యక్తం చేయడం కనిపించింది. వారి ఇరువురు వద్ద నుంచే జిల్లా కేంద్రంలో సిగరెట్, బీడి, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఇరువురు కూడా కనీసం రూ.25వేలు నుంచి రూ.లక్ష వరకు కొనుగులో చేసే ఓ మధ్యతరగతి వ్యాపారులు డబ్బులు చెల్లించిన తర్వాత బయట రసీదులు అందజేస్తే , వ్యాపారులు గోడౌన్ల వద్ద రశీదు తీసుకుని లోపలికు పంపించి సరుకు ఇస్తారని పలువురు చర్చించుకోవడం వినిపించింది. ఇకపోతే చిన్న చిన్న బంకులు, ఇతరత్రా చిరు వ్యాపారం చేసుకుంటూ సిగరెట్, బీడి, గుట్కాలు అమ్ముకునే వారు రెండవ తరహాలో నిల్వలు వుంచిన వారి వద్దకు పోతే వాళ్లు మళ్లీ ధరలు పెంచి విక్రయిస్తున్నారని, ఇలాంటి వారు మరింత ధరలు పెంచి అమ్ముకోకుంటే తప్పా గిట్టుబాటు కాదని, లక్షలాది, వేలాది రూపాయలు కొనుగోలు చేసేవారికి లాభం చేకూరుతుందని ఆవేదన చెందు తున్నారు. ఇలాంటి వ్యాపారుల జీవనోపాధికి భారీగా దెబ్బతీస్తోందని చెప్పవచ్చు. దాదాపు ఈ నెల ప్రారంభం నుంచి సిగరేట్లు, బీడిలు, గుట్కాలు సరఫరా చేసే ప్రముఖ ఏజెన్సీలు కృత్రిమ కొరత సృష్టిస్తూ రావడంతో బ్లాక్‌మార్కెట్‌కు రెక్కలు వచ్చాయని చెప్ప వచ్చు. ఈ తరుణంలోనే బడా వ్యాపారులు తమ ఆర్థిక స్థాయిని బట్టి తమదైన శైలిలో సాధారణ ధరలకు కొనుగులో చేసి భారీ ఎత్తున గోడౌన్లు, ఇళ్లలో, ఇతరత్రా తమకు అనుగుణంగా వున్న ప్రాంతాల్లో నిల్వ వుంచి ప్రస్తుతం 20శాతం ధరలు పెంచేసి మధ్యతరగతి, చిరు వ్యాపారులు విక్రయాలు చేస్తున్నారన్న తీవ్ర ప్రచారం చోటుచేసుకుంది. బడ్జెట్ సమావేశానికి ఇంకా 20 రోజులు వుండగా ఇలా ధరలు పెంచేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నారని, వచ్చే నెల 1వ తేదీ బడ్జెట్ లోపు మరింత పెంచుతారని, ఈ ధరలు పెంచే పరిస్థితి పుష్కలంగా వుందని, ఇప్పటిక ఈ ధరలు వుంటే మరో నాలుగైదు రోజులకు ఇంకో ధర, పది రోజుల్లో మరో పెంచిన ధరలతో పొగాకు ప్రియులకు విక్రయాలు చేయాల్సి ంటుందని చిరు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఏ వ్యాపారి వద్ద చూసిన ఈ ధరలు పెంచడం, బ్లాక్‌లో విక్రయాలు చేస్తుండడం వంటి విషయాలు తెలుస్త

కులాలు వేరైనా మనమంతా హిందువులం

- అట్టహాసంగా హిందూ సమ్మేళన కార్యక్రమం
- హాజరైన హిందూబాంధవులు

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న లక్ష్మణ్‌జీ, సమ్మేళనంలో పాల్గొన్న హిందూబాంధవులు

చిలమత్తూరు, జనవరి 11 ప్రభాతవార్త

కులాలు వేరైనా మనమంతా హిందువులమని ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌జీ, ఆర్ఎస్ఎస్ పార్లమెంట్ డైరెక్టర్ అశోక్‌జీ, జై భజరంగదళ్ మండలాధ్యక్షుడు సతీష్‌లు ఏర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిలమత్తూరు బస్టాండ్ సమీపంలో ఆదివారం హిందూ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ముందుగా చిలమత్తూరు ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ర్యాలీగా భజన చేసుకుంటూ సమావేశం వేదిక వద్దకు చేరుకున్నారు. సుప్రియ బాలాజీ నాట్యమండలి వారిచే భరతనాట్యము, వందేమాతరం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్‌జీ మాట్లాడుతూ హిందువులంతా సంఘటితమై హిందుత్వాన్ని ఊపిరిగా ఆచరించడం ద్వారా హిందూ దేశం పూర్వవైభవ స్థితిని మరలా పొందుతుందని ఉద్ఘాటించారు. అయోధ్యలో రామమందిరం నిర్మించడం హిందూ చైతన్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. యువత సరైన మార్గంలో నడవడం ద్వారానే ఈ దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందన్నారు. ప్రతి హిందువు కనీసం ముగ్గురు లేదా నలుగురు సంతానాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రతి తల్లి తన సంతానాన్ని గమనిస్తూ పెంచాలని, పిల్లల పెంపకంలో ప్రధాన పాత్ర తల్లిదే అని ఆయన ఉద్ఘాటించారు. అనంతరం సమ్మేళనంలో పాల్గొన్న హిందూ బాంధవులకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన కార్య నిర్వాహకులు నరేంద్ర, హరి, నాగభూషణ (రాజి), జమ్మిమాను వీధి యువకులు, బిజెపి మండల అధ్యక్షుడు శ్రీనివాసులుతో పాటు బిజెపి అనుబంధ సంఘాల నాయకులు, విశ్వహిందూపరిషత్, ఆర్ఎస్ఎస్ నాయకులతో పాటు వేలాది మంది హిందువులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

ఓబన్న జయంతి వేడుకలు జరుపుకుంటున్న దృశ్యం

అగళి, జనవరి 11 ప్రభాతవార్త

బ్రిటీష్‌వారి గుండెల్లో నిద్రపోయిన వ్యక్తి, పోరాట యోధుడు వడ్డే ఓబన్న అని జడ్పిటిసి ఉమేష్ అన్నారు. పి.బ్యాడిగెర గ్రామంలోజరిగిన వడ్డే ఓబన్నజయంతి వేడుకలకు జడ్పిటిసి ఉమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వడ్డెర్లు అన్నిరంగాల్లో వెనుక బడ్డారని, దానిని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వారి అభివృద్ధి సంక్షేమానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. భారతమాతను బ్రిటీష్‌వారి సంకెళ్ల నుంచి విడిపించుకోవడానికి వడ్డే ఓబన్న తిరుగులేని పోరాటం చేశారని తెలిపారు. చరిత్రలో గొప్ప యోధుడుగా నిలిచిపోయాడని, తెలుగుజాతి గర్వించ దగ్గ గొప్ప పోరాట యోధుడు వడ్డే ఓబన్న అని తెలిపారు. వడ్డేఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకున్నారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, శివన్న, బుజ్జి, కృష్ణరెడ్డి, కరియన్న, గిరీష్, కృష్ణప్ప పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న పోరాటం నేటి యువతకు స్ఫూర్తివంతం కావాలి.

- బిసివి రాష్ట్ర అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ

వడ్డే ఓబన్న జయంతిలో బిసివి బృందం.

పెనుకొండ జనవరి 11 (ప్రభాతవార్త)

వడ్డే ఓబన్న పోరాటం నేటి యువతకు స్ఫూర్తి కావాలని బహుజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం పెనుకొండ మండల కేంద్రంలోనీ అంబేద్కర్ కూడిలి నందు స్వతంత్ర సమరయోధుడు, రేనాటి వీరుడైన వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమాన్ని బిసివి పెనుగొండ మండల అధ్యక్షుడు నాగలూరు శివ అధ్యక్షతన బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈసందర్భంగా హైకోర్టున్యాయవాది బహుజన చైతన్య వేదిక బృందంతో కలిసి వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో ఈస్ట్ ఇండియా కంపెనీ వారు ప్రవేశపెట్టిన దుర్మార్గమైన పన్ను విధానానికి వ్యతిరేకంగా గేరిల్లా యుద్ధాలతో బ్రిటిష్ వారిని ముప్పు తిప్పలు పెట్టి బ్రిటిష్ సామ్రాజ్య పునాదుల కదిలించి అసువులు బాసిన మొదటి తరం స్వతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న అని, అతని పోరాటపటిమను నేటితరం స్ఫూర్తివంతంగా తీసుకుని ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునివ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో చైతన్య వేదిక రాష్ట్ర మైనార్టీ విభాగం ఆంధ్రస్ ,గౌరవ సలహాదారులు మునిమడుగు నరసింహప్ప,కోశాధికారి రామాంజినప్ప,ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు రోద్దం తిరుపతయ్య,సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడు బూచర్ల నరసింహులు,జిల్లా కోఆర్డినేటర్ అదుదాకలపల్లి ఆంజనేయులు, నియోజకవర్గ గౌరవ సలహాదారులు లక్ష్మణ్ నాయక్, నియోజకవర్గ కార్యదర్శి మంగాపురం లక్ష్మణ్ నాయక్,నియోజకవర్గ సంయుక్త కార్యదర్శి గుట్టూరు రామంజి, జిల్లాయూత్ అధ్యక్షుడు శశి ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, పెనుగొండ మీడియా ఇన్చార్జి రాజశేఖర్, లీగల్ సెల్ కంబాలపల్లి పోతన్న, పెనుకొండ శ్రీనివాస్, కురుబవాండ్లపల్లి మల్లి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రత్యేకంగా నూర్పిడి ప్రదేశాలను ఏర్పాటు చేయండి

అగళి, జనవరి 11 ప్రభాతవార్త

రైతులు తాము పండించిన పంటను నూర్పిడి చేసుకోవడానికి ప్రత్యేక ప్రదేశాలను ఏర్పాటు చేయాలని మండలంలోని రైతులు కోరుతున్నారు. ప్రతి పల్లెకు ఒక నూర్పిడి కేంద్రం ఉంటే రైతుకలు ఉపయోగకరంగాఉంటుంది. రైతులు తమ పండిన పంటను జొన్న, మొక్కజొన్న, రాగి, కందులు, పెసలు, ఉలవలు లాంటి పంటలు ప్రత్యేకంగా నూర్పిడి చేయడానికి కళ్లాలు లేకపోవడంతో పోసిన కంకులను రోడ్లపై వేస్తున్నారు. రోడ్లలో ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర వాహనాల టైర్ల కింద నూర్పిడి చేసుకోవాల్సిన పరిస్థితి. రోడ్లపై పంటను నూర్పిడి చేయడానికి వేసినప్పుడు ఎన్నో ప్రమాదలు జరుగుతున్నాయి. ప్రమాదాల కారణంగా అటు నూర్పిడి చేస్తున్న రైతులు ప్రమదాలకు గురయ్యారు. అంతేకాకుండా, నూర్పిడి చేయడానికి వేసిన కంకులు కార్ల టైర్లలో ఇరుక్కుని, కార్లు, ద్విచక్ర వాహనాలు దగ్ధమైన సందర్భాలు ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని ఉపాధిహామీ పథకంలో వికసిత భారత్ ఉపాధిహామీ పథకంలో నూర్పిడి కేంద్రాల ఏర్పాటుకు ప్రత్యేకంగా ప్రతి గ్రామానికి నిధులు కేటాయించి నూర్పిడి కేంద్రాలను ఏర్పాటు చేయాలని మండలంలోని రైతులు కోరుతున్నారు. అదే పక్క కర్ణాటక రాష్ట్రంలో ఈ పథకం కింద నూర్పిడి కేంద్రాలను ఏర్పాటు చేయడంతో రైతులు తాము పండించిన పంటను ఆ కేంద్రాల్లో నూర్పిడి చేసుకుంటున్నారు. ఆ దిశగా మన రాష్ట్ర ప్రభుత్వం కూడా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైకాపా కోఆర్డినేటర్‌ను కలిసిన మండల కన్వీనర్ సయ్యద్ నిస్సార్

మిథున్‌రెడ్డితో మాట్లాడుతున్న సీనియర్ వైకాపా నాయకుడు నారాయణస్వామి, మిథున్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సయ్యద్ నిస్సార్

లేపాక్షి, జనవరి 11 ప్రభాతవార్త

లేపాక్షి మండల వైఎస్ఆర్‌సిపి కన్వీనర్ సయ్యద్ నిస్సార్ ఆదివారం వైకాపా ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డిని కలిశారు. వైకాపా సంస్థాగత కార్యక్రమానికి హాజరైన మిథున్‌రెడ్డిని లేపాక్షి మండల నాయకులు సయ్యద్ నిస్సార్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ స్థితిగతులపై చర్చించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని లేపాక్షి నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, బీసీ సెల్ రామాంజనేయులు, మైనారిటీ సెల్ అన్సార్, తదితరులు పాల్గొన్నారు

డ్రోన్ కెమెరాల పరివేక్షణలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

పెనుకొండ డిఎస్పి నరసింగప్ప

డీఎస్పీ సమక్షంలో డ్రోన్ వదులుతున్న దృశ్యం

అమరాపురం జనవరి 11 ప్రభాతవార్త

కర్ణాటక సరిహద్దున ఉన్న మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కూడా డ్రోన్ కెమెరాల పర్యవేక్షణతో అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించడానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు పెనుకొండ డిఎస్పి నరసింగప్ప తెలిపారు. అందులో భాగంగా అమరాపురం మండలం దేవగానపల్లి పరిసర ప్రాంతాలలో ఆదివారం కర్ణాటక సరిహద్దున పెనుకొండడి.ఎస్.పి నరసింగప్ప ఆధ్వర్యంలో మడకశిర రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజకుమార్ సమక్షంలో డ్రోన్ కెమెరాల ద్వారా అసాంఘిక కార్యకలాపాలను ముఖ్యంగా గ్యాంబ్లింగ్ మరియు పేకాటస్థావరాలపై, ఓపెన్ డ్రింకింగ్ మరియు ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలను తెలుసుకోవడానికి ఆ ప్రాంతంలో డ్రోన్ల ద్వారా తెలుసుకోవడానికి వదిలినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ప్రతినిత్యం ప్రతి మండలాల్లో కూడా డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేసి గ్యాంబ్లింగ్ నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమరాపురం పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ రామాంజనేయులు, మడకశిర హెడ్ కానిస్టేబుల్ రమణ, కానిస్టేబుల్ శ్రీనాథ్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతోత్సవం

వడ్డే ఓబన్నకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మడకశిర జనవరి 11 ప్రభాతవార్త

మండల పరిధి లోని ఏ ఆర్ రోప్పం గ్రామం లో మొదటితరం వీరుడు స్వాతంత్ర సమర యోధుడు వడ్డెర జాతి ఆరాధ్య దైవం వడ్డే ఓబన్న 219వ జయంతి ఉత్స వాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమిదాల గొంది పంచాయితీ ఏ ఆర్ రోప్పం గ్రామము నందు వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా వడ్డెర సోదరులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా ఆంధ్రప్రదేశ్ కుంచిటిగ వక్కలిగ కార్పోరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ కోట్ల రంగే గౌడ్, పట్టణ అధ్యక్షులు నాగరాజు , జిల్లా తెలుగు దేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వడ్డే రఘురాం, యూనిట్ ఇంచార్జ్ వి.రామచంద్రుడు, నరసింహరాజు,కోర్టు నాగరాజు, బూత్ ఇంచార్జ్ పిజి.దానకర్ణ , విద్యా కమిటీ చైర్మన్ రవి, పత్తి కుంట శశి , మరియు వడ్డెర నాయకులు గ్రామ ప్రజలు హాజరైనారు.

వడ్డే ఓబన్న సేవలు చిరస్మరణీయం

వడ్డే ఓపెన్ జయంతి వేడుకలను నిర్వహించిన దృశ్యం

రొళ్ల జనవరి 11 ప్రభాతవార్త

వడ్డే ఓబన్న సేవలు చిరస్మరణీయమని టిడిపి నాయకులు అన్నారు. మండల కేంద్రంలో గల రైతు సహకార కేంద్రం మైదానంలో ఆదివారం వడ్డే ఓబన్న జయంతి వేడుకలను వడ్డెర సంఘ సభ్యులు స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు.అనంతరం కేక్ కట్ చేసి పంచుకుంటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రతిఘటనలో వడ్డే ఓబన్న కీలకపాత్రవహించారని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, కన్వీనర్ ఈరన్న, ఏపీ ఐఐసి డైరెక్టర్ రామకృష్ణ, గుడ్డగురికి పంచాయితీ మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి,యువ నాయకులు మండల యూనిట్ ఇంచార్జ్ మీసేవ వెంకటేష్,మండల బిజెపి అధ్యక్షులు బద్రీనాథ్ ,భరత్, రాజు, నాగరాజ్ ,పాల్గొన్నారు.

గలాట కేసులో ఐదుగురు అరెస్ట్

బత్తలపల్లి జనవరి 11 ప్రభాతవార్త

గత సంవత్సరం దంపట్ల గ్రామంలో జరిగిన గలాట కేసులో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు ఎస్సై తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై సోమశేఖర్ మాట్లాడుతూ బత్తలపల్లి పోలీస్ స్టేషన్లో గత సంవత్సరం నవంబర్ 15ననమోదు కాబడిన దంపెట్ల గ్రామంలో గలాటా జరిగిందన్నారు. ఆ గలాటా కేసులో ముద్దాయిలు అయిన మల్లెల ఆదినారాయణ, మల్లెల హరిదాసు, మల్లెల మోహన్, మైత్రి, అనిత అను వారందరినీ ఆదివారం అరెస్టు చేసి ధర్మవరం కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

చింతపల సాయం వేలం

అగళి జనవరి11 ప్రభాతవార్త

అగళి పంచాయతీ చింత చెట్ల ఫలసాయాన్ని సోమవారం 12వ తేదీ ఉదయం 11 గంటలకు అగళి సచివాలయం వద్ద వేలం వేనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రంగనాథ్ తెలిపారు వేలం పాటలో పాల్గొనే వేలం దారులు 5వేల రూపాయల డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ చేతుల మీదుగా వైయస్సార్ టిఏ డైరీ, క్యాలండర్ ఆవిష్కరణ

పుట్టపర్తి (కల్చరల్), జనవరి 11, ప్రభాతవార్త

వైయస్సార్ టి ఏ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న మిథున్ రెడ్డి, ఉషశ్రీ చరణ్

పుట్టపర్తి నందు పార్లమెంటు సభ్యులు శ్రీ పి వి మిథున్ రెడ్డి, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ చేతుల మీదుగా సత్యసాయి జిల్లా వైఎస్ఆర్టిఏ యూనియన్ డైరీ,క్యాలండర్ లను ఆదివారం విడుదల చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ జంషీద్, జిల్లా అధ్యక్షులు పివి రమణారెడ్డి, యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో వీటిని ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ నాయకులు ఉపాధ్యాయులు ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ముఖ్యంగా ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు కోసం పార్లమెంటులో ప్రయత్నించాలని, ఓ పి ఎస్అమలు చేయలేని అతిధితులలో సిపిఎస్ స్థానంలో జిపిఎస్ లో కొన్ని మార్పులు చేస్తూ అమలుకు ప్రయత్నించాలని, పెండింగ్ లో ఉన్న డి ఎ లను వెంటనే విడుదలకు ప్రయత్నించాలని కోరారు. ఉద్యోగులందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న పి ఆర్ సి నీ 30 ఫిట్మెంట్ తో వెంటనే అమలు చేయాలని ,ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేసి విద్యేతర కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, సింగిల్ టీచర్ల పాఠశాలలను ఇద్దరు టీచర్లు ఉండేలా చూడాలని, విద్యార్థులు తక్కు వున్నారని పాఠశాలలు మూసివేసి పేద మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేకుండా చేసే చర్యలను ప్రతిఘటించాలని కోరడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లు శ్రీధర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా పరిషత్ అధ్యక్షురాలు గిరిజమ్మ, వెంకట్రామిరెడ్డి, విశ్వేశ్వర రెడ్డి, ప్రకాష్ రెడ్డి, మక్బూల్, శంకరనారాయణ, అనంత వెంకట్రామ్ రెడ్డి, మాధవ్, ఈరళక్కప్పలు కలసి ఉపాధ్యాయ సమస్యలు వివరించా మన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ టి ఏ నాయకులు భాస్కర్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి, శివయ్య, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, జమీర్, హర్షవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రామమోహన్ రెడ్డి, మహమ్మద్ అలీ, కేశప్ప, శంకర్ నాయక్, ప్రకాష్ రెడ్డి, రవీంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

ధర్మవరంటౌన్ జనవరి 11 ప్రభాతవార్త

ధర్మవరంలో వడ్డేఓబన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు

ధర్మవరం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న గారి 219 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పట్టుగూళ్ల కేంద్రం వద్ద ఉన్న వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు, ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ మంత్రి కార్యాలయ ఇంచార్జ్ హరీశ్ బాబు మాట్లాడుతూ రేనాటి ప్రాంతానికి చెందిన వడ్డే ఓబన్న బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా తొలి స్వాతంత్ర్య పోరాటం చేసిన వీరుడని ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. ఓబన్న పోరాట స్ఫూర్తిని భవిష్యత్తు తరాలు మార్గ నిర్దేశం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గొట్లూరు అనిల్, బీజేపీ పట్టణ అధ్యక్షులు జింక చంద్ర,జిల్లా కార్యదర్శి దోలా రాజారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఓంప్రకాష్ గౌడ్, మధుబాబు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి కొంకా నాగార్జున, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు మహేష్ ప్రజాపతి, మైనారిటీ నాయకులు నబిరసూల్, మహిళ నాయకురాలు శారదమ్మ, మంజులాభాయ్, గంగులమ్మ మరియు బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలు

బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో నివాళులర్పిస్తున్న దృశ్యం

బత్తలపల్లి, జనవరి 11 ప్రభాతవార్త

రేనాటి వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయము, వడ్డెర కాలనీ, నాలుగు రోడ్ల కూడలిలో ఓబన్న219 వ జయంతి సందర్భంగా చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర పోరాటంలో ఓబన్న పాత్రను కొనియాడారు. ఈ వేడుకలలో పరిపాలనాధికారి హెచ్.మల్లికార్జున, యస్ రామమోహన్ నాయుడు, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సచివాలయములు, సిబ్బంది, వడ్డెర కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టణంలో వీర జవాన్ మురళినాయక్ విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం

భూమి పూజలో పాల్గొన్న కూటమి నాయకులు

గోరంట్ల, జనవరి 11 ప్రభాతవార్త

దేశం గర్వపడేలా దేశం కోసం మురళినాయక్ చేసిన ప్రాణత్యాగం దేశ ప్రజలు జీవితాంతం గుర్తుంచుకుంటారని సొంత ప్రాంతం గర్వపడేలా ప్రాణాలు అర్పించాడని కొనియాడారు కూటమినేతలు. పాకిస్తాన్ సరిహద్దుల్లో సింధూర్ ఆపరేషన్‌లో వీర మరణం పొందిన మురళినాయక్ విగ్రహం ఏర్పాటుకు గోరంట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయ సమీపంలో ఆదివారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్, స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచు, బంజారా సంఘం నాయకులు సరోజ నాగే నాయక్, జిల్లా బంజారా సంఘం అధ్యక్షులు రవీందర్‌నాయక్, జనసేన మండల అధ్యక్షులు సంతోష్, జిల్లా కార్యదర్శి సురేష్, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ బొట్టు శ్రీనివాసులు తదితరుల ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వీర జవాన్ మురళినాయక్ విగ్రహం ఏర్పాటు స్థలం వద్ద మురళినాయక్ తల్లిదండ్రులు శ్రీరామ్‌నాయక్, జ్యోతిబాయిల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వీర జవాన్‌కు నివాళులర్పించి పనులు ప్రారంభించారు. అనంతరం కన్వీనర్ బాలకృష్ణచౌదరి మాట్లాడుతూ మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు మురళినాయక్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించడం జరిగిందని గతంలో రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి సవితమ్మ హామీ ఇచ్చిన మేరకు విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి గంగాధర, ఉమర్‌ఖాన్, అజంతుల్లా, చింతా రామచంద్రారెడ్డి, మేకల జయరాం, ప్రకాష్‌నాయుడు, జనసేన గాజుల రమేష్, గోవిందప్ప, శ్రీశైలం శ్రీనివాసులు, బంజారా సంఘమ నాయకులు గనేనాయక్, రమేష్‌నాయక్, శ్రీరామ్‌నాయక్, బాలునాయక్ పాల్గొన్నారు.

ఘనంగా పత్తి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు

జన్మదిన కేసును కట్ చేస్తున్న పత్తి చంద్రశేఖర్

బుక్కపట్నం, జనవరి 11, ప్రభాతవార్త

మండల కేంద్రమైన బుక్కపట్నంలోని జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ పుట్టపర్తి నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షుడు పత్తి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల జనసేన యువనాయకుడు తోట అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జన్మదిన కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ జయరాం మండల కేంద్రం అధ్యక్షులు దాసరి శ్రీనివాసు లు హాజరయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం నందు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పత్తి చంద్రశేఖర్ జనసేన పార్టీ ఆవిర్భావం నుండి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడంతో పార్టీ ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్గా నియమించడం జరిగిందన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ అర్చకులు హరి స్వామి భార్య, కొడుకు అల్లుడు , కూతురు, మరణించడంతో వారి పిల్లలు అనాథాలుగా మారారు. ఈ విషయం తెలుసుకున్న పత్తి చంద్రశేఖర్ హరి స్వామి కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు టైలర్ శివ, రామాంజనేయులు, రమణ రాయల్, మన్సూర్,సూరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

నిరసన దీక్షలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పుట్టపర్తి టౌన్, జనవరి 11, ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించేందుకు 2011 లో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు షాన్వాజ్ పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమం సత్తెమ్మ కూడలిలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులను కాలరాస్తూ చట్టాలను కుదించి వేసిందన్నారు. నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే పనిలో నిమగ్నమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం దానిని వ్యతిరేకించకపోవడం దుర్మార్గం అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రజల్లో అవగా

గుంటి కింద సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు..

ప్రత్యేక పూజల్లో పుష్పాలంకరణ తో దర్శనమి స్తున్న సుబ్రహ్మ ణ్యం స్వామి..

గార్లదిన్నె, జనవరి 11,ప్రభాత వార్త: గార్లదిన్నె మండలంలోని కోటంక గ్రామంలో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యస్వామికి ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పుష్పాలంకరణతో అలంకరించగా ఆలయం దివ్యకాంతులతో శోభిల్లింది. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు.

రేనాటి వీరుడు వడ్డే ఓబన్నకు ఎమ్మెల్యే సునీత ఘన నివాళులు

వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రాప్తాడు, జనవరి 11 ప్రభాతవార్త బ్రిటీష్ వలస పాలకుల ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మొట్టమొదట ఎదురుతిరిగిన రేనాటి యోధుడు వడ్డే ఓబన్న అని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఓబన్న జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ యోధుని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర పోరాట ంలో వడ్డే ఓబన్న పోరాటాల గురించి భావితరాల వారు తెలుసుకో వాలన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సేనాధిపతిగా ఉంటూ బ్రిటీష్ వారికి ఎదురు నిలబడ్డారన్నారు. అంతటి యోధుని గురించి అందరికీ తెలి యాలనే ప్రభుత్వం ఆయన జయం తిని రాష్ట్ర స్థాయి కార్యక్రమంగా నిర్వహిస్తోందన్నారు. వడ్డెర్లకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది తెలుగుదేశం పార్టీనేనని.. వారి అభివృద్ధి, సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు చేస్తుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకం

అనంతపురంలో వడ్డే ఓబన్న ర్యాలీలు పాల్గొన్న కూడేరు నాయకులు..

కూడేరు, జనవరి 11 ప్రభాతవార్త ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు రేనాటి వీరుడు వడ్డే ఓబన్న పోరాట ఫలితమే మనకు స్ఫూర్తిదాయకమని కూడేరు మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు.. మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి సూచనల మేరకు, కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆదివారం కడదరకుంట వడ్డే తిమ్మప్ప, చోళ సముద్రం సర్పంచ్, వడ్డేరాజులు వడ్డే ఓబన్న 219 వజయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చేం దుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంత దూరం దృష్టి కలిగిన వారిని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగ నిర్వహించాలని. తన అసెంబ్లీలో కోరిన వెంటనే స్పందించి అధికారికంగా జీవో ఇచ్చినందుకు కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వడ్డే ఓబన్న జీవితం మనకు స్ఫూర్తిదాయకమన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరూ వడ్డే ఓబన్న ఆదర్శంగా తీసుకొని పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలనిపిలుపునిచ్చారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నమ్మకమైన సైన్యాధ్యక్షుడిగా వడ్డే ఓబన్న బ్రిటిష్ పాలకులపై వీరోచిత పోరాటం చేసి ఆంగ్లేయుల సైన్యాన్ని గడగడలాడించి చివరకు ఆయన వీరమరణం పొందారని కొనియాడారు.

జడ్పిలో ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు
- నివాళులు అర్పించిన ఉద్యోగుల

వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జడ్పి కార్యాలయ సిబ్బంది

అనంతపురం సిటీ, జనవరి 11 ప్రభాతవార్త .ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వ హించారు. స్వాతంత్ర్య సమర యోధులు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వడ్డే ఓబన్న చిత్రపటానికి కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారులు విజయభాస్కర్‌రెడ్డి, మల్లి కార్జున, మహబూ బ్‌వలి, ముత్యాలరెడ్డి, ఫణింద్ర, శ్రీవాణిలతోపాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్ పూల ప్రసాద్‌ను పురామర్శించిన డా.సాకే శైలజానాథ్

వైద్యులతో మాట్లాడుతున్న డా.సాకే శైలజానాథ్

శింగనమల, జనవరి 11 ప్రభాతవార్త శింగనమల మండల వైఎస్ఆర్‌సిపి కన్వీనర్ పూల ప్రసాద్ శనివారం గుండెపోటుతో ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై కిమ్స్ సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పూల ప్రసాద్‌ను ఆదివారం మాజీ మంత్రి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి పార్టీ అండగాఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సాకే శైలజానాథ్ మాట్లాడుతూ.. వైఎస్ఆర్‌సిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

మాట్లాడుతున్న ఎస్ఐ పి.కృష్ణమూర్తి

నంబులపూలకుంట, జనవరి 11 ప్రభాతవార్త సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందెలు, పేకాట వంటి అసాంఘీక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.కృష్ణమూర్తి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. సెలవుల నేపథ్యంలో మైనర్ల కు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని, గాలిపటాలు ఎగురవేసే సమయంలో జాగ్ర త్తలు పాటించాలని కోరారు.

కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

నంబులపూలకుంట, జనవరి 11 ప్రభాతవార్త ఎన్‌పి.కుంట మండలం మడెంవారి పల్లి గ్రామానికి చెందిన ఉషారాణి (20) డా/ఆఫ్ శేఖర్ నాయుడు అను మహిళ నిన్న రాత్రి కడుపునొప్పి తాళలేక సూపర్ వాస్మాల్ ద్రావణం తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసింది. అది గమనించిన ఆమె తల్లిదండ్రులు ఆమెను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్లగా అక్కడ ఆమె మరణించడం జరిగినది. ఈ విషయంపై మృతురాలి తండ్రి అయిన శేఖర్ నాయుడు ఫిర్యాదు మేరకు ఎంపీ కుంట పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము.

పెద్దమ్మతల్లి జాతరలో పాల్గొన్న రమేష్‌రెడ్డి

జాతరలో పాల్గొన్న రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, జనవరి 11 ప్రభాతవార్త తాడిపత్రి మండలం తేరన్నపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన శ్రీపెద్దమ్మతల్లి జాతరలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డిని కలిసిన రమేష్‌రెడ్డి

మిథున్‌రెడ్డిని సత్కరిస్తున్న రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, జనవరి 11 ప్రభాతవార్త ఉమ్మడి అనంతపురం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్, ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని వైసిపి రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి మర్యాదపూర్వ కంగా కలిశా రు. వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్య ంగా మిథున్‌రె డ్డి నేతృత్వంలో ఆది వారం పుట్టపర్తిలో కీలక సమావేశం జరిగింది. పుట్టపర్తికి విచ్చే సిన మిథున్‌రెడ్డిని రమేష్‌రెడ్డి ప్రత్యేకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్, జనవరి 11 ప్రభాతవార్త శ్రీసత్యసాయి జిల్లా, అనంతపురం జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తిలోని వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజాప్రతిని ధులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాజంపేట పార్లమెంట్ సభ్యులు, ఉమ్మడి అనంతపురం జిల్లా రాయలసీమ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి హాజరై పార్టీ సంస్థాగత బలోపేతం, రానున్న రోజుల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై కీలక సూచనలపై దిశానిర్దేశం చేశారు.

శ్రీఅశ్వత్థనారాయణస్వామికి అభిషేకాలు

శ్రీఅశ్వత్థనారాయణస్వామికి పూజలు నిర్వహించిన దృశ్యం

పెద్దపప్పూరు, జనవరి 11 ప్రభాతవార్త ధనుర్మాసం సందర్భంగా మండలంలోని చిన్నపప్పూరు సమీ పంలోని పెన్నానది తీరాన వెలసిన అశ్వత్థంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఇందులో భాగంగా శ్రీఅశ్వత్థనారాయణస్వామికి అర్చకులు పంచామృ తాభిషేకాలు అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. అలాగే శ్రీచక్ర భీమ లింగేశ్వరునికి అర్చకులు బాలసుబ్రమణ్యశర్మ పంచామృతా భిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ సుబ్రమణ్యం, సిబ్బంది గుర్రప్ప, అరుణ్ పాల్గొన్నారు.

నేడు సుబ్బరాయసాగర్ నుండి నీరు విడుదల

టిడిపి నాయకులు చవ్వా కుల శేఖర్‌రెడ్డి

పుట్లూరు, జనవరి 11 ప్రభాతవార్త పుట్లూరు మండలంలోని సంజీవపురం గ్రామ సమీపంలో వున్న సుబ్బరాయసాగర్ నుండి పుట్లూరు చెరువుకు నీటిని విడుదల చేస్తున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నీటి విడుదల చేస్తున్న నేపథ్యంలో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. పుట్లూరు మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులను ఖచ్చితంగా నింపాలన్న సంకల్పంతో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డిల సహకారం మరువలేమని ఆయన పేర్కొన్నారు.

వడ్డెర్ల సంఘం అధ్యక్షునికి ఘన సన్మానం

వడ్డెర సంఘం అధ్యక్షున్ని సన్మానిస్తున్న దృశ్యం

అమడగూరు, జనవరి 11 ప్రభాతవార్త మండల వడ్డెర్ల సంఘం నూతన అధ్యక్షునిగా ఎంపికైన పిఆర్‌పి వెంకటరమణను మండల వడ్డెర్ల సంఘం నాయకులు ఆది వారం ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ వడ్డెర కుల స్తులు అందరూ ఎంతో నమ్మకంతో అధ్యక్షునిగా ఎంపిక చేశారని మా నమ్మకాన్ని వమ్ము చేయకుండా వడ్డెర కులానికి చేసే ప్రతి పని తమకు అందరికీ తెలియపరచాలన్నారు. మండలంలోని వడ్డెర కులస్తులు అందరూ ఏకతాటిపై వచ్చే విధంగా మనమందరం కలుపుకొని పోవాలని అప్పుడే వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన ప్రభుత్వ అధికారులతో జరిపిస్తామని ఎవరి వద్ద చేయి చాపే పరిస్థితి రాకూడదని ఇతర కులాల వారు కేవలం వారి కులాలకు అతీతంగా ఎంపిక చేసుకొని విగ్రహాలు పెట్టుకుంటున్నారని మనం కూడా అలాగే నడుచుకోవాలన్నారు. ఎవరిని పడితే వారిని చందాలు అడిగి చులకన కావద్దని ఇది కులానికి మచ్చగా నిలిచిపోతుందని వడ్డెరలను అందరిని సమానంగా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వలిపి అమర్నాథ్, కిష్టప్ప, జయరాం, తిరుపాల్, రామప్ప, రమణ, రంగప్ప, వేణు, శంకరప్ప, రవీంద్ర, జయచంద్ర, బండి శంకర్, తదితర వడ్డెర్లు పాల్గొన్నారు.

హెచ్ఎన్ఎస్ఎస్ కాలువకు గండి కొట్టడం వంటివి చేస్తే కఠిన చర్యలు - ఎన్‌పికుంట ఎస్ఐ

నంబులపూలకుంట, జనవరి 11 ప్రభాతవార్త ప్రభుత్వం వారు హెచ్ఎన్ఎస్ (హంద్రీనీవా సుజన స్రవంతి) కాలువల ద్వారా కృష్ణా నదీ జలాలను కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని చెరువులకు సాగునీటితో నింపడం జరుగుతొంది. అయితే ఎన్‌పికుంట మండలం లోని కొన్ని గ్రామాల్లో కొద్దిమంది అవగాహన లేమితో వారికి ఇష్టం వచ్చిన విధంగా కాలువకు గండ్లు కొట్టడం, పూడ్చటం చేస్తున్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు మా దృష్టికి తీసుకురావడం కారణంగా అధికారుల ప్రమేయం లేకుండా ఎవరైనా హంద్రీనీవా కాలువల విషయంలో గండి కొట్టడం, పూడ్చటం వంటివి చేస్తే అలాంటి వారి మీద పోలీసు వారు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎన్‌పికుంట సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ హెచ్చరించారు.

వేమన ఉత్సవాలపై గ్రామ ప్రజలతో చర్చించిన కందికుంట

గాండ్లపెంట జనవరి 11 ప్రభాతవార్త జనవరి 19 తారీఖున రాష్ట్ర ప్రభుత్వం వేమన జయంతి ఘనంగా నిర్వహించడంతో కటార్పల్లిలోని వేమన ఆలయం వద్ద నిర్వహించడానికి పనులను ప్రారంభించారు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసమే సలహాలు సూచనల కొరకు గ్రామ ప్రజలను మరియు కదిరి నియోజకవర్గం రెడ్ల సంఘం నాయకులను కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ సమావేశపరిచి అన్ని విధాల సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు అదే విధంగా పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తొందరగా కార్యక్రమాన్ని కావలసిన ఏర్పాట్లను త్వరితగతినపూర్తి చేయాలని శాసనసభ్యులు అధికారులను సూచించారు

ఘనంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం 6వ వార్షికోత్సవం
- కార్మికుల పక్షాన కూటమి ప్రభుత్వం ఉంటుంది - ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, జనవరి 11 ప్రభాతవార్త తాడిపత్రి పట్టణం కొత్త మార్కెట్ ప్రక్కన ఉన్న మున్సిపల్ కాంప్లెక్‌లోని మాంగల్య ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం 6వ వార్షికోత్సవాన్ని తాడిపత్రి పట్టణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా కార్మికులు కలిసికట్టుగా ఉంటూ యూనియన్లను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారంటే కార్మికుల యొక్క ఐకమత్యాన్ని అభినందిస్తున్నానన్నారు. కార్మికుల కోసం తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడు అందిస్తానని తెలియచెప్పారు. అలాగే భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాలుగా కార్మిక దినోత్సవాన్ని నడుపుతున్నామంటే అది మా కార్మిక సోదరుల ఐకమత్యమే మొదటి కారణమన్నారు. కార్మికుల ఐక్యత యూనియన్లకు మొదటి బలం అని యూనియన్లను బాగా నడిపించాలంటే ప్రతి ఒక్క కార్మికుడు సోదర భావంతో ఒక కుటుంబంలో కలిసి ఉండాలని అలా ఉన్నప్పుడే యూనియన్లు ఇంకా ముందుకు వెళతాయని ఆయన పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మైదుకూరు ఆంజనేయులు, బేల్దారి అసోసియేషన్ అధ్యక్షుడు గంగయ్య, ఉపాధ్యక్షుడు నాగరాజు, ట్రెజరర్ రంగనాయకులు, కమిటీ సభ్యులు, టౌన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రమ ణ, సెక్రటరీ ఎంసి రాజు, పెయింటర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు నారాయణస్వామి, హైదర్ ఫైజుల్, భగత్‌సింగ్‌నగర్ కాజా, అమర్నాథ్, కమిటీ సభ్యులు కార్పెంటర్ అసోసియేషన్ అధ్య క్షులు షబ్బీర్‌బాష, గౌరవ అధ్యక్షులు ఆచారి, గ్రానైట్ ఫ్లోరింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌస్‌బేగ్, ఉపాధ్యక్షులు రెడ్డి, సెక్రెటరీ పామిడి హాజీ, కమిటీ సభ్యులు టైల్స్ అసోసియేషన్ అధ్యక్షులు షంషీర్, ఉపాధ్యక్షుడు హరి, కమిటీ సభ్యులు, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం కార్మికులు పాల్గొన్నారు.

జాతర ఖర్చు రూ.3 కోట్లు
- 2 వేల పొట్టేళ్లు పెద్దమ్మతల్లికి బలి - తేరన్నపల్లిలో ఘనంగా ముగిసిన పెద్దమ్మతల్లి జాతర



పెద్దమ్మ తల్లిని అలంకరించిన దృశ్యం

బారులు తీరిన వాహనదారులు

తాడిపత్రిఅర్బన్, జనవరి 11 ప్రభాతవార్త తాడిపత్రి మండలం తేరన్నపల్లి గ్రామంలో పెద్దమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలో దాదాపు 500 గృహాలు వున్నాయి. తాడిపత్రి మండలంలోనే అత్యంత సంపన్న గ్రామంగా తేరన్నపల్లి వుంది. గ్రామం నుండి విదేశాల్లో చాలా మంది సాఫ్ట్‌వేర్ కొలువులు నిర్వహిస్తున్నారు. చాలా సంవత్సరాల తరువాత గ్రామపెద్దలు కలిసి సమిష్టి నిర్ణయం తీసుకుని పెద్దమ్మతల్లి జాతరకు ముహూర్తం నిర్ణయించుకుని బంధుమిత్రులను జాతరకు ఆహ్వానిం చడంతో పెద్దఎత్తున గ్రామానికి చేరుకున్నారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. గ్రామంలో అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి మొదట రెండు దున్నపోతులను బలి ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు ప్రతి ఇంటికి మూడు నుండి నాలుగు పొట్టేళ్లను అమ్మవారికి బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు హాజరైన వారికి ఘనంగా విందు ఏర్పాటు చేశారు. తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, టిడిపి నాయకులు, వైసిపి నాయకులు పెద్దఎత్తున జాతరకు హాజరు కావడంతో గ్రామానికి వచ్చే రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయి దాదాపు గంటపాటు ట్రాఫిక్‌జాం అయింది. రూరల్ సిఐ శివ గంగాధర్‌రెడ్డి రెండు రోజుల నుండి గ్రామానికి వెళుతూ జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని గ్రామప్రజలకు గట్టి హెచ్చరికలు చేయడంతో పాటు పెద్దఎత్తున పోలీసుల బందోబస్తు కల్పించడంతో జాతర ప్రశాంతంగా ముగిసింది.

పట్టణంలో మట్కాను కూకటివేళ్లతో పెకలిస్తాం
- మట్కా బీటర్ అరెస్ట్ - రూ.లక్ష స్వాధీనం

మాట్లాడుతున్న సిఐ అరోహణరావు

తాడిపత్రిఅర్బన్, జనవరి 11 ప్రభాతవార్త తాడిపత్రి పట్టణంలో మట్కాను కూకటివేళ్లతో పెకలిస్తామని పట్టణ సిఐ ఆరోహణరావు పేర్కొన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి ఆదేశాల మేరకు పట్టణంలో మట్కా, గ్యాంబ్లింగ్ ఎక్కడ నిర్వహిస్తున్నా సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి జైలుకు పంపుతున్నామన్నారు. ఇప్పటి వరకు 25 కేసులు నమోదు చేశామని, దాదా పు 15 లక్షల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. 6 పేకాట స్థావరాలపై దాడులు చేసి పేకాటరాయుళ్లపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్ నిర్వహించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అవసరమైతే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి పట్టణ బహిష్కరణ చేస్తామన్నారు. గాంధీకట్ట వద్ద ఒకే కుటుంబంలో మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఆరీఫ్‌బాష అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోగా మరో నలుగురు వ్యక్తులు పరారయ్యా యన్నారు. ఆరీఫ్ బాష నుండి లక్ష రూపాయల నగదు, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పరారీలో వున్న మిగిలిన నలుగురు వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నా మన్నారు. పట్టణంలో ఎక్కడైనా మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి తదితర చట్టవ్యతిరేక కార్యకలా పా లు నిర్వహిస్తున్నారన్న సమాచారాన్ని ప్రజలు పోలీసులకు ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా వుంచుతామ న్నారు. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని సిఐ విజ్ఞప్తి చేశారు.

ఘనంగా స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 219 జయంతి వేడుకలు
- వేడుకలకు డుమ్మా కొట్టిన ప్రభుత్వ అధికారులు
- భారీగా హాజరైన వివిధ పార్టీల నాయకులు

వడ్డే ఓబన్న చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అమడగూరు, జనవరి 11 ప్రభాతవార్త అమడగూరు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 219 జయంతి వేడుకలను ఆదివారం వడ్డెర్ల సంఘం మండల అధ్యక్షుడు పిఆర్‌పి వెంకటరమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి శ్రీనివాసులురెడ్డి, తెలుగు యువ నాయకులు శ్యాం బాబునాయుడు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ పాలకులపై వడ్డే ఓబన్న ఎనలేని పోరాటం చేశారని. ఆయన త్యాగాలు నేటియువ తరానికి ఆదర్శమని ఇలాంటి మహనీయుల సేవలను యువత గుర్తించి స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధిత ప్రభుత్వ అధికారులు హాజరు కాకపోవడం పట్ల సంఘ నాయకులు, మండలం ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అధికారులు ఏ మాత్రం పట్టించు కోకుండా ఏ ఒక్కరూ హాజరు కాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వలిపి అమర్నాథ్, మాజీ అధ్యక్షులు కిష్టప్ప, మాజీ అధ్యక్షులు కాసుల శంకరప్ప, మాజీ సర్పంచు కాసుల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి జయరాములు, కార్యదర్శి తిరుపాల్, కోశాధికారి ఇడగుట్ట రామప్ప, ఏపియుడ బ్ల్యుజె మీడియా అధ్యక్షులు వార్త రమణ, ప్రసాద్, రెడ్డప్ప, మాజీ ఎంపిపి రామ చంద్ర, చెల్ల వేణు, గంగులప్ప, రవి, శంకర, మస్తాన్, రామాంజి, కేశవ, అంజనప్ప, వెంకటరమణ, జయ చంద్ర, వెంకటేష్, ఆదెప్ప, చౌడప్ప, బండి శంకర్, వేమనారాయణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వడ్డెర్ల సంఘ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎపిసిపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి
- మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు నాగేంద్ర నాథ్

మాట్లాడుతున్న మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు

కదిరి, జనవరి 11 ప్రభాతవార్త సత్యసాయి జిల్లా సమగ్ర శిక్షణ అడిషనల్ ప్రాజెక్టు కోర్డినేటర్ దేవరాజ్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని మాదిగ ఉద్యోగ

కదిరిలో ఘనంగా స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న 219 జయంతి వేడుకలు

- ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

కదిరి, జనవరి 11 ప్రభాతవార్త

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న 219 జయంతి వేడుకలను ఆదివారం కదిరి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వడ్డే ఓబన్న విగ్రహానికి ఎ మ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, వడ్డెర సంఘం నాయకులు టిడిపి నాయకులు పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. సమాజంలో అన్ని వర్గాల ప్రజలను మంచి చేయాలన్న ఆలోచన ధోరణి తో ఉన్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. జగన్ మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా పోయినప్పటికీ మత విద్వేశాలు, అరాచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. టిటిడిపై వైఎస్ జగన్ కుట్రలు పన్నుతున్నారని మత ప్రచారం ప్రోత్సహించి తోడ్పాటుకు పాల్పడి హిందూ దార్మిక సంస్థలపై దాడికి కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో కానీ దేశంలో కానీ హిందూ తత్వాన్ని అణగదొక్కాలని జగన్ కుట్ర చేస్తున్నారు. సరైన సమయం వచ్చింది కావున వడ్డే కులస్తులు ఏకమై కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని, వచ్చే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వడ్డే ఓవన్న జీవితం మనకు స్ఫూర్తి దాయకమని జీవితంలో ప్రతి ఒక్కరు వడ్డే ఓబన్నను ఆదర్శంగా తీసుకుని ముందుకు పోవాలన్నారు. ఉయ్యాల వాడ నరసింహారెడ్డికి నమ్మకమైన సన్యాధ్యక్షులుగా వడ్డే ఓబన్న బ్రిటీష్ పాలకులపై పోరాటాలు చేసి ఆంగ్లే యుల సైన్యాన్ని గడగడ లాడించి చివరకు ఆయన వీర మరణం పొందారని అన్నా రు. అలాంటి మహానీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటు పడాల న్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్.పార్థసారధి, బిజెపి నాయ కులు తలుపుల గంగాధర్, మున్సిపల్ కౌన్సిలర్లు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ భైరవ ప్రసాద్, వడ్డెర సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డేఓబన్న విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, వడ్డెర సంఘం నాయకులు

వడ్డే ఓబన్న స్ఫూర్తితో వడ్డెర్లు చైతన్యం కావాలి

- వడ్డే ఓబన్న జయంతి వేడుకల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ఓబుళదేవరచెరువు, నవంబర్ 11, ప్రభాతవార్త :

తొలితరం స్వాతంత్ర సమరయోధుడు, రేనాటి వీరుడు, వడ్డెర్ల ఆరాధ్యుడు వడ్డే ఓబన్న స్ఫూర్తితో వడ్డెర్లు చైతన్యం కావాలని మాజీ మంత్రి పల్లె రఘునా థరెడ్డి వడ్డెర్లకు తెలియచేశారు. స్థానిక కొండకమర్ల జంక్షన్ వద్ద వడ్డెర సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న జయంతి వేడుకలకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ డైరక్టర్ వలిపి శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వడ్డెర సేవా సంఘం అధ్యక్షుడు ఇడగుట్ట ఆంజనేయులు, మార్కెట్ యార్డ్ డైరక్టర్ మస్తామన్న, వడ్డెర సంఘం నాయకులు కుంచెపు శ్రీనివాసులు, బిజేపి మండల కన్వీనర్ వీరాంజనేయులు, కుంచెపు ఆంజనేయులు, రంగనాయకులు, చన్నకేశవులు, ఆవుల గంగులప్పతో పాటు వడ్డెర్లు మాజీ మంత్రి పల్లెకు పూలమాలలు వేసి ఆపూర్వస్వాగతం పలికారు.

అనంతరం మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ...ధైర్యానికి, సాహసానికి, పోరాట పటిమకు ప్రతీక వడ్డే ఓబన్న అన్నారు. స్వాతంత్ర పోరాటంలో వడ్డే ఓబన్న ఆంగ్లేయులను గడగడలాడించిన పరాక్రమ వంతుడు అన్నారు. ఉయ్యాల వాడ నరసింహారెడ్డికి సైనాధ్యక్షుడిగా వడ్డే ఓబన్న ఎంతో విశ్వాసంతో ఉన్నాడన్నారు. వడ్డెర్లకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు రావాలన్న ఉద్దేశ్యంతో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించాలని అసెంబ్లీలో కోరారన్నారు. ఇందుకు స్పందించిన ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే సింధూరరెడ్డిని అభినంది ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించి సుముచి గౌరవం ఇచ్చార న్నారు. అంతే కాకుండా క్వారీల్లో వడ్డెర్లకు 15 శాతం రాయితీ కల్పించి ఆర్థిక అభివృ ద్ధికి తోడ్పాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. వడ్డెర్లు వడ్డే ఓబన్న ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. అనంతరం వడ్డే ఓబన్న విగ్ర హ ఏర్పాటుకు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. అంతకుముందు వడ్డే ఓబన్న సర్కిల్, ఐటిఐ, తహశీల్దార్ కార్యాలయం, అంబేద్కర్ సర్కిల్, బస్టా ండ్, పోలీస్ స్టేషన్ వరకూ భారీ బైర్ ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో కన్వీనర్ జయంచంద్ర, జడ్పీటిసి మాజీ సభ్యుడు పిట్టా ఓబుళరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరక్టర్లు నిజాం, కంచి సురేష్, సింగిల్ విండో డైరక్టర్ నారాయణ, ఎంపిటీసి శ్రీనివాసులు, టిడిపి నాయకులు జాకీర్ అహ్మద్, బడిశం రామాంజినేయులు, ఐటిడిపి షానవాజ్, సంగాల శ్రీనివాసులు, సన్నగాళ్ల గంగాద్రి, సుభాషిణి, కొలిమిరాల్లపల్లి సుధాకర్, వైభవి ఆంజనేయులు, జెరిపిటి వెంకటనారాయణ, బోడుగుండ్లపల్లి వెంకటనారా యణ, విజయ్, డివెంకటేష్, నాగరాజు, చంద్ర, అడ్వకేట్ మంజునాథ్, శ్రీరా ములు, ఆర్ఎంపీ కిష్టప్ప, టైలర్ కిష్టప్ప, డ్రైవర్ జయచంద్ర, రాజు, దాముతో పాటు ఆర్సీపి నాయకులు మున్నా, రైతు సంఘం నాయకులు రామచంద్రతో వడ్డెర సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి పల్లె

విగ్రహ ఏర్పాటుకు భూమి చేస్తున్న పల్లె

పురాతన ఆలయం పునరుద్ధరణకు చర్యలు

- హైదరాబాద్, తాడిపత్రి నుండి ప్రత్యేక బృందాలు రాక

- అతి ప్రాచీన శివలింగంను పునరుద్ధరించిన హ్యూమన్ రైట్స్ కమిటీ

నిట్టూరు గ్రామంలో పురాతన కోనేటిని శుభ్రం చేస్తున్న భక్తులు

కోనేటిలో వెలసిన పురాతన శివలింగం

. ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శివలింగాన్ని అలంకరించిన దృశ్యం

యాడికి, జనవరి 11 ప్రభాతవార్త

యాడికి మండల పరిధిలోని నిట్టూరు గ్రామం నడిబొడ్డున కోనేటిలో వెలసిన అతి పురాతన శివలింగంను ఆదివారం హైదరాబాదు, తాడిపత్రి పట్టణాలకు చెందిన హ్యూమన్ రైట్స్ సభ్యులు పునరుద్ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడిపత్రి మాజీ మున్సిపల్‌చైర్మన్ నిట్టూరు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

యాడికి మండలం నిట్టూరు గ్రామం నడిబొడ్డున ఉన్న కోనేటిలో అతి ప్రాచీనమైన శివాలయం ఉన్నదని అయితే వాటి ఆలనా పాలన చూసేవారు లేకుండా పూజా పునస్కారాలకు నోచుకోకుండా చాలా కాలం నుండి నిరాధారణకు గురైనట్లు ఓ భక్తుడు గత వారం సామాజిక మాధ్యమాలలో సమాచారం చేరవేయడంతో హైదరాబాదులోని హ్యూమన్ రైట్స్ సభ్యులు ఆదివారం తరలివచ్చి పర్యవేక్షించారు. చాలా కాలం నుండి వెలిసిన అతి ప్రాచీన శివాలయంను భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వ ర్యంలో గుర్తించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆ ఆలయాన్ని ఆధునికరించే దిశగా అడుగులు వేశా రు. అందుకు స్థానిక భక్తులు వారికి సహాయ సహకారాలు అందించారు.

కనుల పండువగా సత్యసాయి విద్యాసంస్థల వార్షిక క్రీడా సమ్మేళనం

అబ్బురపరిచిన విద్యార్థుల విన్యాసాలు - సత్య సాయి హిల్‌వ్యూ స్టేడియంలో విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన

సత్య సాయి హిల్‌వ్యూ స్టేడియంలో విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన దృశ్యాలు

పుట్టపర్తి టౌన్, జనవరి 11, ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి విద్యాసంస్థల వార్షిక క్రీడా సమ్మేళనం పుట్టపర్తి హిల్‌వ్యూ స్టేడియంలో ఆదివారం అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది. ప్రశాంత నిలయం క్యాంపస్, అనంతపురం క్యాంపస్, బృందావన్ క్యాంపస్, శ్రీమతి ఈశ్వరమ్మ హై స్కూల్ కు చెందిన విద్యార్థులు తమ అద్భుత విన్యాసాలు, క్రీడా నైపుణ్యాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, సమన్వయం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయనే సందేశాన్ని ఈ సమ్మేళనం స్పష్టంగా ప్రతిబింబించింది.

ఉదయం మరియు సాయంత్రం కార్యక్రమాల్లో ప్రశాంత నిలయం క్యాంపస్ విద్యార్థుల కర్ర సాము, సైక్లింగ్ విన్యాసాలు, జిమ్నాస్టిక్ ప్రదర్శ నలు ప్రత్యేక ఆకర్షణగా నిలి చాయి. ఖచ్చితమైన సమయపాలనతో, సమన్వయంతో సాగిన ఈ విన్యా సాలు ప్రేక్షకుల నుంచి అబ్బురపరిచాయి. శారీరక సామర్థంతో పాటు మానసిక ఏకాగ్రతను చాటిచెప్పే విధంగా విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు. అనంతపురం మహిళ క్యాంపస్ విద్యార్థుల మోటార్ బైక్ విన్యాసాలు సమ్మేళనానికి మరింత ఉత్సాహాన్ని జోడించాయి. వేగం, నియంత్రణ, ధైర్యాన్ని సమ పాళ్లలో ప్రదర్శిస్తూ చేసిన ఈ విన్యా సాలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. సాయంత్రం వేళ నిర్వహించిన ఈశ్వరమ్మ స్కూల్, ప్రైమరీ స్కూల్ చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. వివిధ రకాల వేషధారణలో రంగురంగుల వస్త్రాలతో వేదికపైకి వచ్చిన చిన్నారులు నృత్యాలు, గీతాలు, నాటికలతో అలరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, మేనేజింగ్ ట్రస్టీ ఆర్జె రత్నాకర్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ట్రస్ట్ సభ్యులు నాగనంద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, యూనివర్సిటీ ఛాన్సలర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వకలయిక

తాడిపత్రిఅర్బన్, జనవరి 11 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని ప్రకాశం హైస్కూల్‌లో 1996-97 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఉపేంద్రనాథ్‌రెడ్డి, పెద్దన్న, హరిలతో పాటు మరికొంత మంది విద్యార్థుల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులందరిని ఆహ్వానించి కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. మొదట రిటైర్డ్ హెడ్మాస్టర్ వెంకటరామిరెడ్డి, ఉపాధ్యాయులు నరసింహులు, లక్ష్మీనరసయ్య, రవిప్రసాద్, నటరాజ్, రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుత హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయిని స్వరాజ్యలక్ష్మిలను వేదికపైకి ఆహ్వానించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో వున్న అనుబంధాన్ని మరొకమారు గుర్తు చేసుకున్నారు. విద్యార్థులందరూ ఒకరినొకరు పలుకరించుకుంటూ వారు చేస్తున్న పనులు, పాఠశాలలో చదువుతున్నప్పుడు చేసిన అల్లరి చేష్టలు, తదితర వాటిని గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. హాజరైన వారందరికి విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థినీ విద్యార్థులు శైలజ, వేదవతి, జయ, అరుణ, భవాని, రాజీ, మహబూబీ, శివలక్ష్మి, రేఖ, అన్నపూర్ణ, పెద్దన్న, హరీష్, కుళ్లాయిస్వామి, హరి, ఉపేంద్రనాథ్‌రెడ్డి, రామాంజనేయులు, బాబు, రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భూసేకరణ వివరాలు తర్వగా ఇవ్వండి

- వీలైనంత త్వరగా రైతులకు పరిహారం అందేలా చేస్తాం

- రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం

రాప్తాడు, జనవరి 11 ప్రభాతవార్త

జీడిపల్లి జలాశయం నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనుల్లో భూసేకరణ వివరాలు ప్రభుత్వానికి త్వరగా ఇవ్వాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. ఇదే నెలలో పనులు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఆమె రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతపురం క్యాంపు కార్యాలయంలో రామగిరి, కనగానపల్లి, ఆత్మకూరు మండలాల తహసీల్దార్లు, మండల నాయకులు, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్ కు సాగునీరు అందించే పరిటాల రవీంద్ర సాగునీటి కాలువ త్రవ్వకం పనులలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. ముఖ్యంగా ఆత్మకూరు, కనగానపల్లి మండలాల్లో భూసేకరణ పై ఇంకా సరైన నివేదికలు ఇవ్వలేదన్నారు. దీనిపై స్పష్టమైన వివరాలు ఇస్తే వీలైనంత త్వరగా రైతులకు పరిహారం అందుతుందన్నారు. ప్రాజెక్టు పనులు ప్రారంభిచే నాటికి ఎలాంటి సమస్య లు ఉండ కూడదన్నారు. కాంట్రాక్టర్లు, ఇరిగేషన్ అధికారులు తమ పని వేగం గా చేసుకునే విధంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఇంకా స్థానికంగా ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని సూచి ంచారు. ఈ ప్రాజెక్టు కోసం ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదు రు చూస్తున్నా రని.. త్వంలోనే దీనిని సాకరం చేసేలా అడుగులు పడబోతున్నాయ ని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

నీటి సమస్యలపై సమిష్టిగా పోరాడుదాం

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

అనంతపురం సిటీ, జనవరి 11 ప్రభాతవార్త

రాయలసీమకు చట్టపరంగా రావాల్సిన నీటి వాటా కోసం సమిష్టిగా పోరాడుదామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో రాయల సీమ జిల్లాలపై రాయలసీమ జనసంఘం కార్యదర్శి రామాంజి నేయులు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాయలసీమ జనసంఘం అధ్యక్షులు శైలజానాథ్ మాట్లాడుతూ.. నీరు లేకపోతే ఈ ప్రాంతం నాశనం అవుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆపితే ఈ ప్రాంత రైతుల జీవితాలు నాశనం అవుతా యన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేయాలని, ఇందు కోసం పార్టీలకతీతంగా కలిసి పోరాడుదామని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు కొత్తపల్లి సురేష్ మాట్లాడుతూ.. శైలజానాథ్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని చేపట్టి రాయలసీమ నీటి కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా అధ్యక్షులు కృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలో కరువు కష్టాలు తీరాలంటే తాగునీటి ఆవస్యకత ఎంతో ఉందన్నారు. ఎస్‌యుసిఐ పార్టీ అధ్యక్షులు ఆంజినేయులు మాట్లాడుతూ.. రాయలసీమ తాగునీటి ప్రాజెక్టులపై పూర్తి అధ్యాయనం చేపట్టి ఉద్యమాన్ని చేపడుదామని పిలుపుని చ్చారు. కాంగ్రెస్ పార్టీ నేత దాదాగాంధీ మాట్లాడుతూ.. రాయలసీమకు విస్తీర్ణం ప్రకారం 666 టీఎంసీల నీరు ఇవ్వా లని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై తీర్మా ణాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు వీరభద్రయ్య, వేమ న వేదిక నాయకులు అప్పిరెడ్డి హరినాథరెడ్డి, ఉమాపతి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు ముగ్గుల పోటీలు దోహదం

- బిజెపి నాయకుడు అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

- బహుమతులు అందించిన బిజెపి నేతలు

అనంతపురం సిటీ, జనవరి 11 ప్రభాతవార్త

సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు తెలియజేసేందుకు ముగ్గుల పోటీలు దోహద పడుతాయని అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపి లక్ష్మీనారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షులు రాజేష్, బిజెపి సెల్స్ రాష్ట్ర కన్వీనర్ చిరంజీవిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. సంక్రాంతి అంటేనే అన్ని వర్గాలకు సంబరమన్నారు. ప్రధానంగా రైతు లకు పంట చేతికి వచ్చే సమయం లో సంక్రాంతి పండుగ జరుపుకుం టారన్నారు. రైతులతోపాటు మహిళలు సంక్రాంతి అంటే ఎంతో సాంప్రదా యాలను పాటిస్తూ సంబరంగా జరుపుకు ంటార న్నారు. సంక్రాంతికి వన్నెతెచ్చేది ఇంటి ముందు వేసే ముగ్గులేనన్నారు. భవిష్యత్తు తరాలకు అలాంటి ప్రాశస్త్యాన్ని తెలియజేసేందుకై యువతలో ఆసక్తిని పెంపొంది ంచేందుకై బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి ముగ్గుల పోటీలను నిర్వహించడమే కాకుండా ప్రత్యేక బహుమతులను కూడా ఏర్పాటు చేయడం అభినందనీ యమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహి ళలు, యువతులు ముగ్గుల పోటీలలో పాల్గొనగా విజేతలకు మొదటి బహుమతిగా వాషింగ్ మిషన్, రెండో బహుమతిగా కూలర్‌లతోపాటు పలు బహుమతులతోపాటు పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ హేమలత, భరతనాట్య కళాకారిణి డా.హరితలతోపాటు పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులను అందిస్తున్న బిజెపి నేతలు

యుటిఎఫ్ రాష్ట్రస్థాయికమిటీలో జిల్లాకు చోటు

అనంతపురం న్యూటౌన్, జనవరి 11 ప్రభాతవార్త

యుటిఎఫ్ 51వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం గుంటూరులో నిర్వహించారు. ఆదివారం జరిగిన ఎన్నికలలో మన జిల్లాకు రెండు ప్రధాన పోస్టులు కేటాయించారు. అందులో మొట్ట మొదటి జిల్లా మహిళా రాష్ట్ర కార్య దర్శిగా వి.దేవేంద్రమ్మను, రాష్ట్ర ఆడిట్ కమిటి మెంబర్‌గా రెండవ సారి ఎస్‌వివి రమణయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారుఅందుకుజిల్లా శాఖ వీరికి శుభాకాంక్షలు తెలియచేసింది. దేవేంద్రమ్మ గారు మాట్లాడుతూ మన ఊరి బడిని కాపాడు కుందాం, బడి లో ఎన్రోల్మెంట్ పెంచే దానికి దానికి ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని, 12 పిఆర్‌సి కమిటిని వెంటనే నియమించాలని ఆర్థిక బకాయిలు చిల్లించాలని, పదవీ విరమణ చేసి సంవత్సరం దాటినా వారికీ ఇంత వరకు గ్రాట్యుటీ, పిఎఫ్ మొత్తాలు చెల్లించక పోవడం దుర్మార్గమని వారు బయట అప్పులు చేసి వడ్డీ చెల్లిస్తున్నారని దీనిని అర్థం చేసుకొని వెంటనే వారికి రావలసిన బకాయిలు చెల్లించాలని, ఐఆర్ 29 ప్రకటించి పెండింగ్ డిఎలు చెల్లించాలని ఇద్దరు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మా జిల్లాకు ప్రాధాన్యత కల్పించినందుకు రాష్ట్ర శాఖకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోటేశ్వరప్ప, ఈశ్వరయ్య ఉద్యమాభి వందనాలు తెలిపారు.

వి.దేవేంద్రమ్మ

ఎస్‌వివి రమణయ్య

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

నేడు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక - జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ ఇన్చార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్ జనవరి 11ప్రభాతవార్త

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ శివ నారాయణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. నేడు అనగా సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబం ధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చి న అర్జీలకు సంబంధి ంచిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమై నప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్‌ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్‌ను వాట్స్‌అప్‌లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజి స్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్‌గా దానిని పూరిం చాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జి ల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా ఇన్చార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మ

నేడు ఖిడయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ

అనంతపురం కలెక్టరేట్ జనవరి 11 ప్రభాతవార్త

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్ర మం ద్వారా అనంతపురం ,శ్రీ సత్య సాయి జిల్లా, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబరు: 897771 6661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు.

సిఎండి శివశంకర్

కోడిని మాయం చేసిన పోలీసు

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన - బొగ్గుల లారీ నుంచి డబ్బులు వసూలు చేసిన మరో పోలీస్ - కంబదూరు పోలీస్ స్టేషన్లో ఇద్దరిపై సస్పెన్షన్ వేటు

కంబదూరు, జనవరి 11 , ప్రభాతవార్త

కంబదూరు పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న ఓ కానిస్టేబు